RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 360 పేజీలు - 05 వెల - 04/- శనివారం14 సెప్టెంబర్ 2024

## ఫ్లడ్ మేనేజ్‌మెంటులో

# బాబు విఫలం

- జగన్నామ స్మరణను ఆపండి
- ఫ్లడ్ మేనేజ్‌మెంటులో బాబే విఫలం
- వర్షాలు,వరదలతో రైతులకు తీరని నష్టం
- బాధితులను మోసం చేసే కుట్రలో బాబు
- పవన్ సినిమా ఆర్టిస్ట్..బాబు డ్రామా ఆర్టిస్ట్
- ఇది మ్యాన్ మేడ్ విలయం అన్న జగన్

కాకినాడ,సెప్టెంబర్13 ఆంధ్ర ప్రగతి :

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏపీలో భారీ వర్షాలు, వరదలతో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని వైసీపీ అధినేత , మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో వరదలకు నష్టపోయిన గ్రామాలను జగన్ శుక్రవారం సందర్శించి, బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బాధితులను మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు . అబద్దాలు చెప్పడంలో చంద్రబాబు గ్లోబల్‌కు తమ్ముడు అవుతారని విమర్శించారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన పవన్‌కల్యాణ్‌కు పాలన గురించి ఏమీ తెలియదని ఆయన సినిమా ఆర్టిస్ట్ అయితే చంద్రబాబు డ్రామా ఆర్టిస్ట్ అని ఎద్దేవా చేశారు.



మిగతా 2లో

## చిత్తూరు లో ఘోర రోడ్డు

# ప్రమాదం


- ఎనిమిది మంది దుర్మరణం
- రెండు లారీలను ఢీకొన్న బస్సు
- మొగిలి ఘాట్ వద్ద ప్రమాదం
- తిరుపతి నుంచి బెంగళూరుకు వెళుతుండగా యాక్సిడెంట్

చిత్తూరుసెప్టెంబర్13 ఆంధ్ర ప్రగతి :

చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు లారీలను బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. బస్సు తిరుపతి నుంచి బెంగళూరుకు వెళుతుండగా మొగిలి ఘాట్ వద్ద ఈ ప్రమాదం జరిగింది.




మిగతా 2లో



## రోడ్ల మరమ్మతులపై

# దృష్టి పెట్టండి..

### అధికారులకు చంద్రబాబు ఆదేశం ..
### వాహన క్లైమ్ లు త్వరగా సెటిల్ చేయండి..

**అమరావతి** సెప్టెంబర్13 ఆంధ్ర ప్రగతి :

వర్షాలు.. వరదలతో ధ్వంసమైన రోడ్ల మరమ్మతులపై దృష్టి సారాలించాలని ఆదేశించారు ముఖ్యమంత్రి చంద్రబాబు . అమరావతి సచివాలయంలో నేడు ఆయన జు ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ, వరదలకు ధ్వంసమైన రోడ్ల మరమ్మత్తులపై దృష్టి సారించాలన్నారు.. మొత్తం ఎన్ని కిలో మీటర్ల మేర రోడ్లు దెబ్బ తిన్నాయనే విషయంపై ఆరా తీశారు.. దీనికి రాష్ట్రవ్యాప్తంగా 4 వేల కిలో మీటర్లకు పైగా రోడ్లు దెబ్బ తిన్నాయన్న సీఎం దృష్టికి తీసుకెళ్లారు అధికారులు.. దీంతో ప్రాధాన్యాతల వారీగా దెబ్బతిన్న రోడ్లకు రిపేర్లు చేయాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు..అనంతరం వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టం అంచనా కార్యక్రమంపై రివ్యూ నిర్వహించారు సీఎం. అది ముగిసిన వెంటనే విజయవాడ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు.. . వరద బాధితుల సాయంలో భాగంగా బ్యాంకర్లు, ఇన్ స్యూరెన్స్ ఏజెన్సీల ప్రతినిధులతో మాట్లాడారు.. వేలాది వాహనాలు దెబ్బతిన్న నేపథ్యంలో బీమా ఏజెన్సీలు త్వరతగతిన బీమా క్లైమ్ లు సెటిల్ చేయాలని కోరారు..

## ప్రభుత్వ శాఖల్లో 100 రోజుల

# కార్యాచరణ ప్రణాళిక

### వేగవంతంగా అమలుచేయండి :సిఎస్



అమరావతిసెప్టెంబర్13 ఆంధ్ర ప్రగతి : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద ఆర్ధికేతర మరియు స్వల్ప కాలంలో పరిష్కరించ గలిగిన అంశాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు వెంటనే ఆయాశాఖలు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు.100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వైద్య,ఆరోగ్య,హోం,జిఏడి,న్యాయ,దేవాదాయ ధర్మాదాయ,ప్రణాళిక, ఎక్సైజ్,జల వనరులు,మైన్స్ అండ్ జియాలజీ,ఇంధన,వ్యవసాయ,సహకార,పశుసంవర్ధక, మత్స్య,గ్రామ,వార్డు సచివాలయ, సాంఘిక, బిసి,మైనార్టీ,ఇబిసి సంక్షేమం,చేనేత జౌళి శాఖలకు **మిగతాది 2లో...**

## వైసిపి నేతలు దేవినేని అవినాష్, జోగి రమేష్‌కు సుప్రీంకోర్టులో ఊరట





2లో

# జగన్ నిర్లక్ష్యం..
# విద్యార్థుల పాలిట శాపం.!

ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 13:

గత వైసిపి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, పబ్లిసిటీ పిచ్చ విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ఒక్కసారిగా వెయ్యి స్కూళ్లను సిబిఎస్ఈ పరీక్షా విధానానికి మార్చింది. రాష్ట్ర పరీక్షలకి, సిబిఎస్ఈ పరీక్షా విధానానికి వ్యత్యాసం ఉంటుంది. ఉపాధ్యాయులు సిబిఎస్ఈ పరీక్షా విధానంలో భోధన చేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే విద్యార్థులను కూడా ఫౌండేషన్ స్థాయి నుండే సిబిఎస్ఈ పరీక్షా విధానానికి సన్నద్ధం చెయ్యాల్సి ఉంటుంది. కానీ అటువంటి చర్యలు ఏమీ చేపట్టకుండానే నాటి సీఎం జగన్ మోహన్ రెడ్డి వెయ్యి స్కూళ్లను సిబిఎస్ఈ పరీక్షా విధానం లోకి మార్చాలని నిర్ణయం తీసుకొని హడావిడిగా అమలు చేశారు. ఈ ఏడాది ఈ వెయ్యి స్కూల్స్ లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు సిబిఎస్ఈ విధానంలో పరీక్షలు రాయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడటం, విద్యా శాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు తీసుకున్న తరువాత సిబిఎస్ఈ సమస్యను అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.



మిగతా 2లో

## జైలు నుంచి కేజ్రీవాల్ విడుదల..

### ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్



2లో

# ఫ్లడ్ మేనేజ్‌మెంటులో బాబు విఫలం



(మొదటి పేజీ తరువాయి)

ఏలేరు రిజర్వాయర్ కింద వరదలొస్తాయని తెలిసినా ప్రజలను అప్రమత్తం చేయలేదని పేర్కొన్నారు. రిజర్వాయర్ మేనేజ్‌మెంట్‌ను పట్టించుకోలేదని, ఇది ప్రకృతి సృష్టించిన విలయం కాదని , మ్యాన్‌మేడ్ ఫ్లడ్ అని అన్నారు. ప్రభుత్వం బాధ్యత లేకుండా ప్రవర్తిస్తుందని, ప్రజల పట్ల మానవత్వం చూపడం లేదని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు రైతులకు రైతుబీమా, రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీలు అందించలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏది జరిగినా జగన్ కారణమంటూ జగన్ నామాన్ని జపం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. బాధితులను ఆదుకోవడంతో ప్రభుత్వం కేవలం ఫొటోలకే పరిమితమైందని ఆరోపించారు. చంద్రబాబు మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని స్పష్టం చేశారు.

అబద్ధపు ప్రచారాల్లో చంద్రబాబు గోబెల్స్‌కి తమ్ముడి వరుస. అబద్దాలను మ్యానుఫ్యాక్చర్ చేయడంలో దిట్ట. వాటిని అమ్ముకోగలిగే కెపాసిటీ ఈ భూమ్మీద కేవలం ఒక్క చంద్రబాబుకే ఉందని జగన్‌మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఏలేరు వరద ముంపు బాధిత గ్రామాల్లో పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌లో చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ప్రజలను ఇబ్బంది చేయడమే కాకుండా చంద్రబాబు ఇప్పుడు జగన్‌పై విమర్శలు చేస్తున్నారు. అధికారంలో వచ్చి ఇన్నిరోజులు గడిచినా.. తాను చేయాల్సిన పనులేవీ చేయలేదు. దానంతటికి కారణం జగనే అంటారు. ఎక్కడ ఏం జరిగినా.. జగన్ పేరే చెప్తారు.. ఆర్బీకే వ్యవస్థను నిర్వీర్యం చేశారు. సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థనలనూ నాశనం చేశారు. రైతులకు పెట్టుబడి సాయం చేయడం లేదు. పంటల బీమా ప్రీమియమ్ కూడా కట్టడం లేదు. వ్యవసాయ సీజన్ మొదలైంది. వారికి అందాల్సిన సున్నా వడ్డీ పంట రుణాలు ఏమయ్యాయి?. పెట్టుబడి సాయం రైతు భరోసా ఏమైంది? రూ.20 వేలు ఇస్తామన్నారు. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.ల్గ÷తులకు పంట నష్టం జరిగితే, గతంలో అన్ని వ్యవస్థలు పక్కాగా ఉండేవి. ఆర్బీకేలు ఉండేవి. ఇన్సూరెన్స్ ఉండేది. ఇన్‌పుట్ సబ్సిడీ ఉండేది. రైతులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అన్ని

విధాలుగా ఆదుకునే వాళ్లం. కానీ ఇప్పుడు అవేవీ లేవు. గతంలో రైతులకు ఎంత వచ్చేది? ఒక్కసారి ఆలోచించండి. ఇప్పుడే కనుక జగన్ ప్రభుత్వం ఉండి ఉంటే.. రైతులకు పెట్టుబడి సాయం అంది ఉండేది. సీజన్ ప్రారంభంతోనే సాయం చేసి ఉండేవాళ్లం. గతంలో పంట నష్టం జరిగితే హెక్టార్‌కు రూ.17 వేలు ఇచ్చాం. గతంలో చంద్రబాబు హయాంలో అది కేవలం రూ.15 వేలు మాత్రమే. ప్రీమియం కట్టి ఉండే వాళ్లం కాబట్టి రూ.24 వేల నుంచి రూ.25 వేల వరకు బీమా పరిహారం వచ్చేది. దాంతో పాటు, పెట్టుబడి సాయం, సున్నా వడ్డీ కింద దాదాపు రూ.5 వేల వరకు.. అన్నీ కలిపి రైతులకు ప్రతి ఎకరాకు దాదాపు రూ.45 వేల వరకు సాయం అంది ఉండేది. కానీ, ఈ పెద్ద మనిషి ఏం చెబుతున్నారు?. ఎకరాకు రూ.10 వేలు ఇస్తానన్నారు. ఎలా? ఈ?క్రాపింగ్ లేదు.. అడిటింగ్ లేదు. ఆర్బీకే వ్యవస్థ లేదు. ఇంకా ఇన్సూరెన్స్ గురించి చెప్పడం లేదు. బాబు హయాంలో కేవలం రూ. 3 వేల కోట్లే వచ్చింది. ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.1,250 కోట్లు చెల్లించకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇన్సూరెన్స్ చెల్లించలేదు. భరోసా గురించి నోరు మెదపరు. ఇన్ని విధాలుగా రైతులు నష్టపోతున్నా.. చంద్రబాబు మాత్రం నిజం మాట్లాడరు. చంద్రన్న వస్తే రూ.20 వేల ఇస్తానని మోసం చేశారు. రూ.15 వేలు ఇస్తానని బడి పిల్లలను మోసం చేశారు. రూ. 18వేలు ఇస్తానని అక్కచె÷-లలెమ్మలను మోసం చేశారు. ఏడాదికి రూ. 36 వేల నిరుద్యోగ భృతి అని మోసం చేశారు. రూ. 2 వేలకోట్లకు పైగా ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించలేదు. విద్యాదీవెన, గోరుముద్ద గాలికి ఎగిరిపోయింది. లా అండ్ఆర్డర్ గాలికొదిలేశారు. బాధితులపైనే తిరిగి కేసులు పెడుతున్నారు. వరద బాధితులకు కనీసం పునరావాసం కూడా కల్పించడం లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతీ ఒక్కటీ డోర్ డెలివరీ చేసేవాళ్లం. కానీ ఇప్పుడు ఏది కావాలన్నా.. టీడీపీ నాయకులనే అడగాలి. ఆ నాయకులు ఇళ్లలోనే సచివాలయ సిబ్బంది పెన్షన్ పంచుతున్నారు. ఎవరైనా అలా వెళ్లి పెన్షన్ తీసుకోకపోతే, కట్ చేస్తున్నారు. ప్రభుత్వ పాలన గాలికి ఎగిరిపోయింది. రాష్ట్రం అతలాకుతలం అవుతోంది. చంద్రబాబు హయాంలో ఎవరూ తమ బాధ్యతలు నిర్వర్తించరు. ఇలాంటి దారుణ పాలన పోవాలి. ప్రజలకు అన్నీ అర్థమవుతున్నాయి. చంద్రబాబు చెప్పిన అబద్దాలు, మోసాల కింద మారుతున్నాయి. ప్రజలకు కోపం వస్తోంది. వారు తిరగబడే రోజులు దగ్గరే ఉన్నాయి. అది జరగకూడదని రెడ్‌బుక్ పాలన చేస్తున్నారు. అయినా ఏం చేయలేరు. ప్రజలు ఇంకా భరించే పరిస్థితి లేదు. ఈ ప్రభుత్వం ప్రజల కష్టాలకు స్పందించడం లేదు. చంద్రబాబు ఎంతసేపూ డ్రామాలు చేస్తున్నారు. ఫొటోలకు ఫోజులు ఇస్తూ షోలు చేస్తున్నాడు. పవన్ కల్యాణ్ సినిమా ఆర్టిస్ట్. చంద్రబాబు డ్రామా ఆర్టిస్ట్. పవన్ కంటే బాబు బాగా నటిస్తున్నాడు. పవన్‌కు పెద్దగా ఏం తెలియడం లేదు' అని జగన్ అన్నారు. జగన్ వెంట కన్నబాబు, వంగా గీత తదితరులు ఉన్నారు.

# జగన్ నిర్లక్ష్యం..
# విద్యార్థుల పాలిట శాపం.!

(మొదటి పేజీ తరువాయి)

సిబిఎస్ఈ పరీక్షా విధానం అమలు పై ఉన్నత అధికారులతో అనేక సమీక్షలు నిర్వహించిన తరువాత మంత్రి ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు ఇంటర్నల్ అసెస్మెంట్ చెయ్యాలని అధికారులను ఆదేశించారు. సుమారుగా 80 వేల ట్యాబ్ లతో దేశంలో మొదటి సారి ఇంటర్నల్ అసెస్మెంట్ నిర్వహించింది విద్యా శాఖ. అయితే ఈ పరీక్షల ఫలితాలతో విస్తుగొలిపే నిజాలు బయటపడ్డాయి. 90 శాతం విద్యార్థులు ఇంటర్నల్ అసెస్మెంట్ లో ఫెయిల్ అయ్యారు.

326 స్కూళ్ల లో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదు.
1- 25 శాతం పాస్ పర్సంటేజ్ ఉన్న స్కూల్స్ 556,
26- 50 శాతం పాస్ పర్సంటేజ్ ఉన్న స్కూల్స్ 66,
51-75 శాతం పాస్ పర్సంటేజ్ ఉన్న స్కూల్స్ 37,
76-99 శాతం పాస్ పర్సంటేజ్ ఉన్న స్కూల్స్ 14,
100 శాతం పాస్ పర్సంటేజ్ ఉన్న స్కూల్స్

77,478 మంది విద్యార్థులు ఇంగ్లీష్ పరీక్ష రాయగా 59,518 మంది టెస్ట్ లో ఫెయిల్ అయ్యారు. మ్యాథ్స్ పరీక్ష 77,478 మంది రాయగా 56,213 మంది టెస్ట్ లో ఫెయిల్ అయ్యారు. సైన్స్ 77,478 రాయగా 49,410 మంది పరీక్షలో ఫెయిల్ అయ్యారు. సోషల్ స్టడీస్ లో 77,478 మంది పరీక్ష రాయగా 48,766 మంది ఫెయిల్ అయ్యారు. సిబిఎస్ఈ పరీక్షా విధానం బోధించే శిక్షణ ఉపాధ్యాయులకు ఇవ్వలేదు, విద్యార్థులు సిబిఎస్ఈ విధానంలో పరీక్షలు రాసి పాస్ అయ్యే పరిస్థితి లేదు.

ఇంటర్నల్ అసెస్మెంట్ లో వచ్చిన ఫలితాలను విద్యశాఖ ఉన్నతాధికారులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో చర్చించిన తరువాత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆ 1000 స్కూళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు స్టేట్ బోర్డు విధానంలో పరీక్షలు రాసేందుకు వెసులుబాటు కల్పించాలని మంత్రి లోకేష్ నిర్ణయం తీసుకున్నారు.


2025-26 విద్యాసంవత్సరం 6వ తరగతి నుండే పరీక్షా విధానంలో మార్పులు తీసుకొచ్చి విద్యార్థుల సామర్థ్యం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

సిబిఎస్ఈ పరీక్షా విధానంలో ఫెయిల్ అయితే విద్యార్థులపై ఆ ప్రభావం ఎక్కువ ఉంటుంది, మానసికంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారు. సమాజం వారిని ఫెయిల్యూర్స్ గా చూస్తుంది. అందుకే విద్య శాఖలో తీసుకునే ప్రతి నిర్ణయం ఆలోచించి తీసుకోవాలని లోకేష్ అధికారులతో అన్నారు. 2025-26 విద్యాసంవత్సరం 6వ తరగతి నుండి పరీక్షా విధానంలో తీసుకొచ్చే మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సామర్థ్య పెంపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. టోఫెల్ టీచ్ చేసే టీచర్లు లేకపోయినా టోఫెల్ తీసుకొచ్చాం అని చెప్పుకోవడం, ఉపాధ్యాయులకు ఎటువంటి శిక్షణ ఇవ్వకుండానే ఐబి సిలబస్ తీసుకొచ్చేస్తున్నాం అంటూ పబ్లిసిటీ ఇలా ఒక్కటేంటి విద్య వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తూ వైసిపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల కారణంగా 5 ఏళ్ల పాలనలో లక్షల్లో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిపోయారు. విద్య వ్యవస్థలో హడావిడి నిర్ణయాల వలన విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుంది. విద్యార్థుల భవిష్యత్తు ను దృష్టిలో పెట్టుకొని అవసరమైన సమూల మార్పులు విద్యాశాఖలో తీసుకొచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చెయ్యాలని లోకేష్ అధికారులను ఆదేశించారు.

# పోలీస్ స్టేషన్లో ముంబై సినీ నటి జత్వానీ ఫిర్యాదు.!

ఆంధ్ర ప్రగతి
అమరావతి సెప్టెంబర్ 13:

ముంబై సినీ నటి జత్వానీ కేసు కీలక మలుపు తిరిగింది. కృష్ణా జిల్లా వైసిపి నేత కుక్కల విధ్యా సాగర్ తనను, తనతో పాటు తన కుటుంబ సభ్యులను చిత్ర హింసలకు గురి చేశారని ముంబైకు చెందిన సినీనటి నరేంద్ర కుమార్ జత్వనీ శుక్రవారం నాడు ఇబ్రహీంపట్నం పోలీసులకు పిర్యాదు చేశారు. శుక్రవారం నాడు సాయంత్రం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు తన న్యాయవాది ఉమేష్ చంద్ర తో వచ్చిన ఆమె ఇబ్రహీంపట్నం సిఐ చంద్రశేఖర్ కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఘటనలో కుక్కల విధ్యా సాగర్ తో పాటు మరి కొందరు తనను అక్రమంగా నిర్భందించి చిత్ర హింసలకు గురి చేశారని ఆమె పిర్యాదు లో పేర్కొన్నట్లు సిఐ చంద్రశేఖర్ తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కృష్ణా జిల్లా కు చెందిన వైసిపి సీనియర్ నేత కుమారుడు కుక్కల విధ్యా సాగర్ ప్రేమ పేరుతో తనను నమ్మించి మోసం చేశాడని విజయవాడ పోలీసులకు పిర్యాదు చేయగా మోసానికి గురయిన మహిళకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారులే తన పట్ల అనుచితంగా ప్రవర్తించారని గత కొద్దిరోజుల క్రితం ఆమె మీడియాతో మాట్లాడుతూ కన్నీరు మున్నీరుగా విలపించారు. దీని పైన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజయవాడ ప్రస్తుత పోలీసు కమిషనర్ కు పిర్యాదు చేశారు. దీని పైన విచారణ కమిటీ వేశారు. సదరు కమిటీ విచారణ పూర్తి అయిన నేపథ్యంలో నటి జత్వానీ ని ఇబ్రహీంపట్నం లోని డాక్టర్ ఎన్టీటిపిఎస్ కు చెందిన గెస్ట్ హౌస్ లో నిర్బంధించినట్లు ఆమె వాంగ్మూలం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఆమెను



నిర్బంధించిన ప్రాంతం ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ పరిధి కావడంతో పోలీసుల సూచన మేరకే జత్వానీ ఇబ్రహీంపట్నం స్టేషన్ లో పిర్యాదు చేసి ఉంటారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కుక్కల విధ్యా సాగర్ తో పాటు విచారణ పేరుతో తన పైన అనుచితంగా ప్రవర్తించిన వారిపైన కూడా చర్యలు తీసుకోవాలని ఆమె పిర్యాదు లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే ఆమె ఇచ్చిన పిర్యాదు పైన న్యాయ సలహాను తీసుకొని కేసును నమోదు చేస్తామని ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. నేరం యొక్క తీవ్రతను బట్టి ఎవరి పేరులు చేర్చాలి. ఎంతమందిని అరెస్టు చేయాలనేది తరువాత వెల్లడిస్తామని చెప్పారు.

# చిత్తూరు లో ఘోర రోడ్డు ప్రమాదం...

(మొదటి పేజీ తరువాయి)

గాయపడిన వారిని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రోడ్డు ప్రమాదం కారణంగా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్ ను క్లియర్ చేస్తున్నారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.
బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. అనుకోని ప్రమాదంలో ఎనిమిది మంది మరణించడం బాధాకరం అన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యారోగ్య శాఖను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని.. ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## ప్రభుత్వ శాఖల్లో 100 రోజుల
# కార్యాచరణ ప్రణాళిక
## వేగవంతంగా అమలుచేయండి:సిఎస్

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన ప్రాధాన్యత అంశాలు,ముఖ్యంగా 100 రోజుల్లో పరిష్కరించ గలిగే ఆర్థికేతర పరమైన అంశాలకు సంబంధించి సమీక్షించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న మరియు ఆర్థికేతర అంశాలకు చెందిన వివిధ ప్రజా సమస్యలు లేదా ఇతర అంశాలను 100 రోజుల్లోగా పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం శాఖల వారీగా 100 రోజుల్లో పరిష్కరించ దగ్గ ప్రాధాన్యతాంశాలపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశిచారు. ఈసమావేశానికి వర్చువల్ గా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి.కృష్ణ బాబు,హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్,దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్య నారాయణ పాల్గొన్నారు. అదే విధంగా సమావేశంలో దేవాదాయశాఖ కార్యదర్శి ఎస్.సత్య నారాయణ,న్యాయ శాఖ కార్యదర్శి సునీత,జిఏడి అదనపు కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు,ఇంకా ప్రణాళిక,ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైసిపి నేతలు దేవినేని అవినాష్, జోగి రమేష్‌కు సుప్రీంకోర్టులో ఊరట

అమరావతి సెప్టెంబర్13 ఆంధ్ర ప్రగతి :

వైసిపి నేతలు దేవినేని అవినాష్, జోగి రమేష్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది.. టీడీపీ ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో దేవినేని అవినాష్, జోగి రమేష్‌లపై వచ్చే నెల నాలుగో తేది వరకు ఎటువంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది.. కాగా టిడిపి కార్యాలయం దాడి కేసులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ముందస్తు బెయిల్ ను నిరాకరించడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు వైసీపీ నేత దేవినేని అవినాష్, మాజీ మంత్రి జోగి రమేష్.. వారి పిటిషన్‌పై నేడు విచారణ జరిపిన సుప్రీంకోర్టు దేవినేని అవినాష్, జోగి రమేష్ లకు రక్షణ కల్పించాలని సూచించింది.. మరోవైపు.. ఈ కేసు విచారణకు దేవినేని అవినాష్, జోగి రమేష్ సహకరించాలని పేర్కొంది..

# 16న రెండు కొత్త వందే భారత్ రైళ్లు



హైదరాబాద్,సెప్టెంబర్13 ఆంధ్ర ప్రగతి : తెలుగు ప్రజలకు ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కానుక అందించారు. ఈ నెల 16న ప్రధాని మోదీ తెలుగు రాష్ట్రాల్లో 2 కొత్త వందే భారత్ రైళ్లను ప్రారంభించనున్నారు. నాగ్‌పూర్ - హైదరాబాద్, దుర్గ్ - విశాఖపట్టణం మధ్య రెండు వందే భారత్ రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. ఢిల్లీ తర్వాత హైదరాబాద్ నుంచే అత్యధికంగా వందేభారత్ రైళ్ల అనుసంధానత కలిగిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రధాని మోదీ ఆపన్న హస్తం అందించారని కేంద్రమంత్రి తెలిపారు. 70ఏళ్లు దాటిన వారందరికీ రూ.5లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించారు. పేద, ధనిక తేడా లేకుండా 6 కోట్ల మంది వయోవృద్ధులకు లబ్ది చేకూరనుంది. వచ్చే రెండేళ్లలో ఈ పథకంపై రూ.3,437 కోట్లను కేంద్రం ఖర్చు చేయనుంది. తెలంగాణ నుంచి అదనంగా మరో 10 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు లబ్ది జరగనుంది. 70 ఏళ్లు దాటిన వయో వృద్ధులందరికీ.. ఈ పథకం కోసం ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇప్పటికే ఆయుష్మాన్ పరిధిలో ఉన్న కుటుంబాల్లోని 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు అదనంగా ఏడాదికి రూ.5లక్షల టాప్-అప్ కవర్ ఇవ్వనుంది. కేంద్రం నిర్ణయంతో.. వయోవృద్ధుల్లో హర్షం నెలకొంది. వయోవృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న ప్రధాని మోదీకి కృతజ్ఞతలని కిషన్‌రెడ్డి తెలిపారు.

# జైలు నుంచి కేజ్రీవాల్ విడుదల..



ఢిల్లీసెప్టెంబర్13 ఆంధ్ర ప్రగతి :

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ లభించిన విషయం తెలిసిందే. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ భూన్యా ఇద్దరూ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేశారు.సీబీఐ కేసులో సుప్రీంకోర్టు ఆయనకు ఈ బెయిల్ మంజూరు చేసింది. దీనికి ముందు, ఈడీకి సంబంధించిన కేసులో కేజ్రీవాల్ సుప్రీంకోర్టు నుండి బెయిల్ కూడా పొందారు. తాజాగా.. శుక్రవారం సాయంత్రం కేజ్రీవాల్ జైలు నుంచి విడుదల అయ్యారు.ఆయనకు స్వాగతం పలికేందుకు ఆప్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు భారీ ఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు. అంతేకాదు.. కేజ్రీవాల్‌కు జైలు ఎదుట పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ స్వాగతం పలికారు. అయితే ఈ ఢిల్లీ లిక్కర్ కేసులో కేజ్రీవాల్ మార్చి 21న అరెస్టు కాగా, జూన్ 26న తిహార్ జైలు నుంచి సీబీఐ అరెస్ట్ చేసింది. దాదాపు ఐదున్నర నెలల పాటు కేజ్రీవాల్ తిహార్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే.

# ఈనెల 28 29 30వ తేదీలలో నంద్యాలలో జరిగే ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 13:
డ్రైవర్ల జీవితాలతో చెలగాటం ఆడే భారత న్యాయ సంహిత చట్టం సెక్షన్ (1)(2) లను రద్దు చేయాలని,రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సెప్టెంబర్ 28 29 30 వ తేదీలలో నంద్యాల జిల్లా కేంద్రంలో మూడు రోజుల పాటు జరిగే ట్రాన్స్పోర్ట్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని మోటార్ వర్కర్స్ యూనియన్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఎల్లయ్య, సహాయ కార్యదర్శి టి.శివరాం, ఉపాధ్యక్షులు ఏవి.భాస్కర్ రెడ్డి,సిఐటియు మండల అధ్యక్షులు పి. రామాంజనేయులు రవాణా రంగ కార్మికులకు పిలుపునిచ్చారు.స్థానిక కొండపేటలోని మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం నందు శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది.

### కామ్రేడ్ ఏచూరి కి ఘన నివాళులు

ముందుగా శ్రమజీవుల అరుణ తార,దేశం గర్వించదగ్గ నేత,సిపిఎం పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్" సీతారాం ఏచూరి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత పది సంవత్సరాల కాలంలో డ్రైవర్ల సంక్షేమం కోసం కృషి చేసిన దాఖలాలు లేవని,రవాణా రంగ కార్మికుల సంక్షేమానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేయడం లేదని,కేరళ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ బోర్డు తరహాలో ప్రతి రాష్ట్రం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని,డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని, ప్రతి 50 కిలోమీటర్లకు విశ్రాంతి తీసుకోవడం కోసం విశ్రాంతి భవనాలను ఏర్పాటు చేయాలని,డ్రైవర్లకు కనీస వేతనం అమలయ్యేలా ప్రభుత్వం యజమానులపై ఒత్తిడి




తీసుకురావాలని డిమాండ్ చేశారు.లేనియెడల రాబోవు కాలంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ, ఉపాధ్యాయ,కార్మిక,రైతు,ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించడానికి సిద్ధం కావాలని,కార్మికుల జీవితాలతో చెలగాట మాడే ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని,గతంలో రైతుల పోరాటం ఏ విధమైన ఉధృతికి దారి తీసిందో ఆస్ఫూర్తితో పోరాటాలు సాగించాలని,దేశానికి అన్నం పెట్టే రైతన్న దేశానికి వెన్నెముక లాగా ప్రతి వస్తువు ప్రజలకు చేరాలంటే డ్రైవర్ కూడా అంతే ముఖ్యమని,ప్రభుత్వాలు మనుగడ సాగించడానికి కావలసిన ఆర్థిక వనరులు సింహభాగం రవాణా రంగం నుండే సమకూరుతున్నాయని, ఇటువంటి రవాణా రంగాన్ని నిర్వీర్యం చేస్తే ప్రభుత్వాలు పాలన సాగించడం కష్టమవుతుందని,డ్రైవర్లు అంత ఏకమై ఆందోళనల కు పూనుకుంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఏర్పడుతుందని, ప్రభుత్వం పునరాలోచించు కోవాలని హెచ్చరించారు భారత న్యాయ సంహిత చట్టం 106(1),2 లను రద్దు చేసేంతవరకు భవిష్యత్ కార్యాచరణ కొరకు AIRTWF ఆధ్వర్యంలో నంద్యాలలో సెప్టెంబర్ 28 29 30వ తేదీలలో మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర సదస్సులో తీసుకునే నిర్ణయాల్లో రవాణా రంగ కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మోటార్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి ఎస్.సుబ్బారెడ్డి,లారీ మెకానిక్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎలక్ట్రిషన్ రంగడు,అధ్యక్ష,కార్యదర్శులు ఎస్.కె.హుస్సేన్, లింగం,కమిటీ సభ్యులు మాసం భాష,గౌస్, ప్రైవేట్ స్కూల్ బస్సు యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.మద్దిలేటి,నాయకులు నూర్ భాషా,గోపాల్, ఖాసీం,కంబగిరి, రంగస్వామి,ఆర్టీసీ హాయర్ బస్సు యూనియన్ అధ్యక్షులు సుబ్బయ్య గౌడు,మినీ లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు మస్తాన్,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు గౌడ్, నాగేశ్వరరావు,మహేష్, మద్దయ్య,రాంబాబు,శేఖర్, తిమ్మయ్య, రామకృష్ణ,సూరన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

# రైతు బజారా లేక పశువుల పాకనా.?

**-సిపిఐ (యం యల్ ) లిబరేషన్ పార్టీ. జిల్లా నాయకుడు గాలి రవిరాజ్ సూటి ప్రశ్న.**




ఆంధ్రప్రదేశ్ నంద్యాల సెప్టెంబర్ 13:
నంద్యాల పట్టణం లోని నడిబొడ్డున వున్నా రైతు బజారా లేకపోతే పశువుల పాకల అని సిపిఐ (యం యల్ ) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు గాలి రవిరాజ్ అధికారులను నాయకులను సూటిగా ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణం లోని రైతు బజారు పశువుల పాకకంటే దారుణంగా తయారయ్యాయని రైతు బజారు కంటే పశువుల పాకాలనే శుభ్రంగా వుంచుతారని ఆయన ఏద్దేవా చేశారు నాయకులు మారిన రైతు బజారు తలరాత మారడం లేదని రైతులు ఇక్కడికి రావాలంటే బయపడుతున్నారని వారు ఆరోపించారు. మార్కెట్ యార్డు కు ఆదాయం వున్న ఆచరణలో వెనుకబడి వున్నారన్నారు. రైతు బజారు లో వున్న కాల్వలపై దిమ్మలు పగిలిపోయి ఇబ్బందులు లకు గురైతున్నారని రైతులు అనువుగా అమ్ముకోవడానికి వున్న పైన సిమెంట్ రేకులు పగిలిపోయి వర్షాకాలం వచ్చిందంటే పూర్తిగా బందర్ దొడ్డిలా తయారైతుందని ఇకనైనా అధికారులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉంటే రైతు బజారు సమస్యలను తీర్చాలని వారు డిమాండ్ చేశారు.

# సేంద్రియ ఎరువులు-వ్యవసాయంలో వాటి ప్రాముఖ్యత

**-తోడేండ్ల పల్లెలో రైతు సదస్సులు. -పాల్గొన్న వినూత్న ఆగ్రోటెక్ ప్రతినిధులు.**

ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ సెప్టెంబర్ 13:
ప్రస్తుత వ్యవసాయ రంగంలో సేంద్రియ ఎరువుల ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధిస్తున్నారని వినూత్న ఆగ్రోటెక్ ఎల్ ఎల్ పి మార్కెట్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ బిల్లా రాజేష్ యాదవ్ అన్నారు.
శుక్రవారం ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని తోడేళ్ల పల్లె గ్రామంలో సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు చేపట్టవలసిన జాగ్రత్తలు, సూచనలపై రైతు సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి బిల్లా రాజేష్ యాదవ్ తో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్ నాయక్, మస్తాన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు సదస్సు కార్యక్రమంలో వారు నేటి వ్యవసాయంలో రసాయన ఎరువులు మరియు రసాయన మందులు వాడటం నానాటికి పెరుగుతుందన్నారు. వీటి ప్రభావం వల్ల మనకు తెలియకుండానే భూమిలో ఉన్న జీవరాశులపై అధికంగా ఒత్తిడి పెరగడంతో పాటు అధిక రసాయన ఎరువులు వాడటం వలన భూమిలోని జీవరాశులలో



అతి ముఖ్యమైన సముదాయమైన సూక్ష్మంగా జీవులు పై పడి వాటి సంఖ్య తగ్గిపోతుంది అన్నారు. తద్వారా గణనీయమైన మార్పులు భూమిలో సంతరించుకొని భూమికి ఉన్న సహజ గుణాలు మరియు భూ ఆరోగ్య పరిస్థితి నానాటికి క్షీనిస్తుందన్నారు. తద్వారా రైతుకు పెట్టుబడి విషయంలో అధికమైన భారం కూడా పడుతుందన్నారు."వినూత్న ఆగ్రో టెక్ఎల్.ఎల్.పి." సంస్థ గత 2 సంవత్సరాలుగా సేంద్రీయ, జీవన ఎరువులను అందిస్తుందన్నారు.సేంద్రియ ఎరువులు వాడటం వల్ల రైతులకు పెట్టుబడి తగ్గడంతో పాటు భూమి సారవంతంగా తయారవుతుందన్నారు.
సేంద్రియ జీవన ఎరువులైన"యోధ సేంద్రియ ఎరువులు, యోధ సి ఎం ఎస్,జీవన్ గోల్డ్, రైతుమిత్ర, ప్రణయ్, గ్రో హై గ్రాన్యూల్స్, గ్రో హై లిక్విడ్, డెల్టా ప్రో, తులిప్, యువరాజ్, డైనమైట్, జనని, ట్రిగర్ %××%, టర్బో %××%, కే జి ఎఫ్ 6, రోషిని, ఉజ్వల్ %××%, త్రిసూల్, ధర్మవీర్ , రత్నా, పృధ్వీరాజ్, తిరంగా, నైట్స్, త్రిలోక్, ఇగ్నిస్ 5 అవనీ న్యూట్రిన్, అవనీ గోల్డ్, అవనీ జింక్ ప్లస్ (జెడ్33%ఎస్15%), అవనీ న్యూట్రిసోల్ (కే ఎం ఎస్-22.18.20), అవనీ కాబన్, అవనీ సీ గోల్డ్ (పౌడర్/గ్రానువాల్స్) , అవనీ సీ గోల్డ్ (లిక్విడ్), అగ్ని, విభా ప్లస్, వాల్ట్, ధన్వి , వాల్ యు ప్యాక్, టిల్లరింగ్ బోస్టర్, సాయిల్ రిసువేటర్, లను పంటకు అధిక దిగుబడులు ఇవ్వడంతో పాటు ఎక్కువ లాభాలు రైతులు పొందుతారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు. రైతు సోదరులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# టెలికాం సలహా కమిటీ సభ్యుల నియామకం.

**-నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ధన్యవాదములు తెలిపిన నూతన సభ్యులు.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 13:
నంద్యాల పార్లమెంట్ పరిధిలో ని బి ఎస్ ఎన్ ఎల్ ( టెలికామ్) సలహా కమిటీ సభ్యులుగా పాములపాడు కురువ రమేష్, పాణ్యం చిట్టిబోయిన శ్రీనివాస యాదవ్, కల్లూరు మధు, ఆత్మకూరు గౌస్ లాజం, నూనెపల్లె పెరుమాళ్ళ విజయకుమార్ లను నియమించారు. బి ఎస్ ఎన్ ఎల్ ( టెలికామ్ సంస్థ) కు ఐదు మంది సభ్యులను నియమించేందుకు సహకరించిన నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి కి నూతనంగా నియమించిన టెలికామ్ సభ్యులు ధన్యవాదములు తెలిపారు.



# ప్రభుత్వ జూనియర్ కాలేజీకి కంప్యూటర్లు అందజేత

**-ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ దే అంటున్న విద్యార్థినిలు**



ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 13:
నంద్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీకి ఎన్.ఎం.డి ఫరూక్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. 20 రోజుల క్రితం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో, విద్యార్థినులకు కంప్యూటర్లు అందజేస్తానని హామీ ఇచ్చిన మంత్రివర్యులు, నేటితో ఆ మాటను సాకారం చేశారు. ఉర్దూ అకాడమీ ద్వారా ఆ కాలేజీకి ఐదు కంప్యూటర్లు అందించారు.ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ విద్యాభివృద్ధికి కట్టుబడి ఉందని, విద్యార్థినీ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడం కోసం ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. కాలేజీ అభివృద్ధికి తమ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చి, ఈ కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరూ టెక్నాలజీని నేర్చుకోవాలని మంచి ఉద్దేశంతో ఈ కంప్యూటర్లను విద్యార్థినిలు సద్వినియోగం చేసుకుని మెరుగైన విద్యను అభ్యసించాలని సూచించారు. అంతేకాకుండా మరికొన్ని కంప్యూటర్లు కాలేజీకి అందజేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని కూడా తెలియజేశారు. అనంతరం విద్యార్థినిలు మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కామ్రేడ్, సీతారాం ఏచూరి సంతాప సభ

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 13:
సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించి కొద్ది క్షణాలు మౌనం పాటించి నివాళులర్పించారు.
కామ్రేడ్ సీతారాం ఏచూరి సిపిఎం పార్టీ అఖిలభారత కార్యదర్శిగా ఉంటూ అనారోగ్య కారణాల రీత్యా చనిపోవడం జరిగింది. 50 సంవత్సరాలుగా విద్యార్థి దశ నుండి చివరి వరకు పార్టీ ఉద్యమమే ఊపిరిగా పనిచేసినటువంటి మహనీయుడు సీతారాంఏచూరి అనిసిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్, సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి పులా నరసింహ, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు తోట మద్దులు,సిపిఎం పార్టీ పట్టణం కార్యదర్శి వర్గ సభ్యులు కేఎండి గౌసు,డి లక్ష్మణ్, వెంకట లింగం,పార్టీ నాయకులు రామరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాయక్, తదితరులు మాట్లాడుతూ సీతారాం ఏచూరి బహుభాషా కోవిధుడని అనేక భాషల్లో అనర్గళంగా ప్రజలకు హత్తుకునేలాగా మాట్లాడగలరని వారన్నారు.మత గ్రంధాలు చదివి అందులో ప్రజలకు ఉపయోగపడే సారాంశాన్ని బయటకు చెప్పేవాడని అన్నారు. రాజ్యాంగ పాఠాన్ని ఆకలింపు చేసుకొని.రాజ్యాంగ విలువలకు కట్టుబడుతూ రాజ్యాంగ వ్యతిరేకమైనటువంటి చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యమాలు నడిపేవాడు అన్నారు. 12




సంవత్సరాల పాటు రాజ్యసభ సభ్యునిగా ఉంటూ ఉత్తమ పార్లమెంటేరియన్ గా అనేక అంశాల పైన లోతైన విశ్లేషణలు చేస్తూ ప్రభుత్వానికి సలహాలు ఇచ్చేవారన్నారు. విద్యార్థి దశలోనే ప్రతిష్టాత్మకమైన జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ లో మూడు పర్యాయాలు అధ్యక్షునిగా కొనసాగుతూ నాటి ఇందిరాగాంధీని ఇంటి దగ్గర ధర్నా చేసి ఇందిరా గాంధీ వెంటనే యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచ కమ్యూనిస్టు మహాసభలన్నిటిలోనూ పాల్గొంటూ వారి మహాసభల్లో స్ఫూర్తిని నింపేటువంటి నాయకుడు సీతారాంఏ చూరని ప్రపంచ నాయకులే పొగుడుతున్నారని వారన్నారు.మతోన్మాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజల ఐక్యత కొరకు లౌకికవాదానికి కట్టుబడి దానికోసం ప్రాంతీయ పార్టీలను లౌకిక శక్తులను ఐక్యం చేస్తూ కూటములు ఏర్పాటు చేసే విషయంలో ఈయన ముందున్నారని వారు అన్నారు.దేశ పరిస్థితుల పైన లోతైన అధ్యయనం చేస్తూ విశ్లేషణ చేసే వారిని వారన్నారు. నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా నిర్దిష్ట కార్యాచరణ ఉండాలని అందుకు కార్యకర్తలందరికీ దిశా నిర్దేశం చేసే వారిని వారన్నారు. పీపుల్స్ డెమోక్రసీ పత్రికకు ఎడిటర్ గాను, హిందుస్థాన్ టైం పత్రికకు వ్యాసాలు రాసే వ్యాసకర్తగాను, దేశ పరిస్థితుల పైన అనేక పుస్తకాలు రాసే రచయితగాను,అన్ని రాజకీయ పార్టీలకు నాయకులకు మంచి మిత్రుడు గాను కొనసాగాడని వారన్నారు. ఉన్నత కుటుంబంలో జన్మించిన,ఐఏఎస్,ఐపీఎస్ ఉద్యోగస్తుల కుటుంబాల్లో ఒకరుగా ఉన్నా వారి ప్రభావాలకు లోను కాకుండా పేద ప్రజల అభివృధే జీవిత లక్ష్యంగా ఎంచుకొని చివరి వరకు ఆ కర్తవ సాధన కొరకు పోరాడని వారన్నారు. ఆయన ప్రపంచ మేధావి అని ఆయన లేని లోటు సిపిఎం పార్టీకి లౌకిక ప్రజాతంత్ర శక్తులకు నష్టదాయకంగా ఉందని వారన్నారు.ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు నిజమైన నివాళులు అని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు జైలను, సుబ్బారావు, హరి, సాయికృష్ణ,వెంకటేశ్వర్లు,మహిళా నాయకురాలు భాను, విజయ,తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను విజయవంతం చేయండి.

## -క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.




ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 13:
ఈనెల 17 నుండి అక్టోబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం, పిజిఆర్ఎస్, డివార్మింగ్ డే తదితర అజెండా అంశాలపై ఆర్డీవోలు, తాసిల్దారులు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఈనెల 17 నుండి అక్టోబర్ 1 తేదీ వరకు 15 రోజులపాటు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పరిశుభ్రత కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల ఉద్యోగస్తులను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసి పాల్గొనేలా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారము స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు జరగాలన్నారు. పారిశుధ్య కార్మికులచే దేవాలయాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పర్యాటక ప్రదేశాలు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలన్నారు.
అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పారిశుద్ధ కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా 74 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు సరఫరా చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఆరోగ్య భీమా కూడా వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో డయేరియా కేసులు నమోదు కాకుండా ఎప్పటికప్పుడు ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులు శుభ్రపరచడంతో పాటు క్లోరినేట్ చేసిన సురక్షిత మంచినీటినే సరఫరా చేయాలని సంబందిత అధికారులను సూచించారు. ఇ- క్లీనింగ్ లో భాగంగా మొబైల్ డేటా తో పాటు చెడిపోయిన సెల్ ఫోన్స్ ,టీవీలు, ల్యాప్టాప్ లు, కంప్యూటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలన్నింటిని ఈ వేస్ట్ కింద క్లియర్ చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులకు సానిటేషన్ పరికరాలు, వస్తువులతో పాటు గ్లౌజులు, మాస్క్ లు తదితర సురక్షిత వస్తువులను గ్రామ పంచాయితీలలోని 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి కొనుగోలు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.
పిజిఆర్ఎస్ నందు స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన రీతిలో ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. ప్రతిరోజు పిజిఆర్ఎస్ లాగిన్ అయి ఉన్న సమస్యలను పరిశీలించి, అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారులతో మాట్లాడకుండా అతనికి తెలియకుండా సమస్యను క్లోజ్ చేయరాదన్నారు. అర్జీలను ఆడిట్ చేసేందుకు కలెక్టరేట్ నందు ప్రత్యేకంగా ఆడిటింగ్ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. అర్జీలకు సరైన సమాధానం ఇవ్వని అధికారులకు షోకాస్ నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. ఏ ఒక్క అర్జీ కూడా రీఓపెన్ కాకుండా అర్జీదారులతో మాట్లాడి వారికి సరైన సమాధానాలు తెలియజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాతీయ నులి పురుగుల దినోత్సవంలో భాగంగా 1- 18 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ టాబ్లెట్లను మింగించాలన్నారు. ఈ నెల 17న మిస్సయిన వాళ్లకు ప్రతికంగా ఈనెల 25వ తేదీన ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత పిల్లలకు టాబ్లెట్లు ఇచ్చి సంబంధిత మెడికల్ బృందాలు అక్కడే ఉండి పిల్లలను పరిశీలించాలన్నారు.
జిల్లాలో లక్ష కుటుంబాలకు వంద రోజుల పని దినాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. గృహ నిర్మాణాల పురోగతికి సంబంధించి హౌసింగ్ మ్యాన్డేట్స్ కల్పిస్తే వేతన రేట్ పెరిగి జిల్లాకు అదనపు మెటీరియల్ కాంపోనెంట్ వస్తుందన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అన్ని పారామీటర్లలో జీరో శాతం ప్రగతి కనబడుతుందని రాష్ట్రంలో నంద్యాల జిల్లా దిగివ స్థానంలో ఉందన్నారు. చివరి క్వార్టర్లో అంగన్వాడీలు, ఆరోగ్య కర్తల సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే నాలుగు మాతృ మరణాలు సంభవించాయన్నారు. పెండింగ్ లో ఉన్న 60 వేల ఎకరాల ఈ పంట, రెండు లక్షల రైతుల ఈ కేవైసీ పూర్తి చేసేందుకు ఆర్డీవోలు, వ్యవసాయ అధికారులు, తాసిల్దారులు, వీఆర్వోలు, ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ మంజులవాణి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డలో ప్రబలిన అతిసారం..

## ముగ్గురు మృతి.

## -అప్రమత్తమైన అధికార యంత్రాంగం.



ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ సెప్టెంబర్ 13 :
ఆళ్లగడ్డ లో అతిసార వ్యాధి కోరలు చాచడంతో ఇప్పటివరకు ముగ్గురు మృతి చెందారు. ఆళ్లగడ్డలోని అభ్యుదయ కాలనీ లో వాంతులు విరోచనాలతో చంద్ర (51) బాబు (70) , చాంద్ వెతికి చెందిన చాంద్ బి (70) అనే మహిళ మృతి చెందారు. మరో 50 మందికి పైగా అస్వస్థతకు గురికావడంతో అర్బన్ హెల్త్ సెంటర్ కు తరలించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెంటనే అప్రమత్తమై అభ్యుదయ కాలనీలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. సద్దాం కాలనీ, దొమ్మర కాలనీ, అభ్యుదయ కాలనీలలో కూడా అతిసార ప్రబళింది. అతి సార వ్యాధిగ్రస్తులతో ఆళ్లగడ్డ అర్బన్ ఆసుపత్రి రోగులతో నిండిపోయింది. ఈ విషయమై అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహ మీడియాతో మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలో అతి సార వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవడం జరిగిందని మెడికల్ క్యాంపును కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా మృతి చెందిన వారు గణేష్ నిమజ్జనం రోజున చేతులు కడుక్కోకుండా రంగులు అంటించుకొని ప్రసాదాలు తినడం వల్ల వాంతులు విరోచనాలకు గురైనట్లు తెలిపారు. ప్రజలు కాచి చల్లార్చి వడగట్టిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. ఆహార పదార్థాలు కూడా వేడిగా ఉన్నప్పుడు భుజించాలని బయట పదార్థాలు తినరాదని డాక్టర్ నరసింహ హెచ్చరించారు.

# వరద బాధితులకు నిత్యవసర సరుకులు

## బోండాతో కలసి మంత్రి గొట్టిపాటి పంపిణీ



విజయవాడ,సెప్టెంబర్13 ఆంధ్ర ప్రగతి
రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు తో కలిసి విజయవాడలోని సింగ్ నగర్ లో పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాలు అయిన పలు డివిజన్లలోని సుమారు 3,500 కుటుంబాలకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి కుమారుడు విఘ్నేశ్ రెడ్డి బాధితుల కోసం పంపిన నిత్యవసర సరుకులు అందజేశారు. మంత్రులను, అధికార యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ బాధితులకు అండగా నిలిచారు. వరదలతో నష్టపోయిన వారిని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుంది. ఇందుకు సంబంధించి వరద నష్టం అంచనాకు కూడా ప్రత్యేక బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అంచనాలు పూర్తి కాగానే పరిహారం అందిస్తామని అన్నారు. వరద బాధితులకు సాయంగా కందుల విఘ్నేశ్ రెడ్డి నిత్యవసర సరుకులను పంపిణీకి ముందుకు రావడంపై మంత్రి అభినందించారు.

# టిడిపి ఖాతాలో చేరిన జగ్గయ్యపేట

## చైర్మన్, సహా కౌన్సిలర్లు టిడిపిలో చేరిక



జగ్గయ్యపేటసెప్టెంబర్13 ఆంధ్ర ప్రగతి :
ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి అధికారంలోకి వచ్చాక.. వైసీపీ పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతోంది. తాజాగా జగ్గయ్యపేట మునిసిపాలిటీని టీడీపీ కైవసం చేసుకుంది. జగ్గయ్యపేట వైసీపీ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, ఆ పార్టీ శ్రేణులు టీడీపీలో చేరారు. దీంతో ఈ మునిసిపాలిటీ టీడీపీ కైవసం అయ్యింది. శుక్రవారం నాడు మంత్రి నారా లోకేష్ సమక్షంలో జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పలువురు వార్డు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. తెలుగుదేశం పార్టీలో చేరిన వారిలో.. 7వ వార్డు కౌన్సిలర్ పూసపాటి సీతారావమ్మ దంపతులు, 31వ వార్డు కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, 23వ వార్డు కౌన్సిలర్ డి రమాదేవి దంపతులు ఉన్నారు. వీరందరికీ పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు మంత్రి లోకేష్. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కూడా ఉన్నారు. సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే.. వైసీపీ నేతల తీరుపై విమర్శలు గుప్పించారు. మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కూడా వైసీపీని వీడుతారనే ప్రచారం జరుగుతోందన్నారు. అది ఆయన వ్యక్తిగత నిర్ణయం అని అన్నారు. జగ్గయ్యపేట మునిసిపాలిటీ ఇక టీడీపీది అని అన్నారు. వాస్తవానికి ఈ మునిసిపాలిటీలో టీడీపీకి 14 మంది కౌన్సిలర్లు ఉండగా వైసీపీకి 17 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అయితే, తాజా చేరికలతో టీడీపీ బలం 18కి పెరిగింది. వైసీపీ బలం 13కి పడిపోయింది. దీంతో జగ్గయ్యపేట మునిసిపాలిటీ టీడీపీ వశమైపోయింది. పార్టీ మారిన నేతలు మాట్లాడుతూ.. 5 ఏళ్లు వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదన్నారు. మునిసిపాలిటీ అభివృద్ధి కోసమే టీడీపీలో చేరుతున్నామని ప్రకటించారు. ఏలూరులోనూ వైసీపీకి బిగ్ షాక్ ఇచ్చారు సొంత పార్టీ నేతలు. నగర కార్పొరేషన్లో ఐదుగురు వైఎస్ఆర్సీపీ కార్పొరేటర్లు పార్టీకి రాజీనామా చేశారు. వీరంతా టీడీపీలో చేరారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి.. టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## గుడ్లవల్లేరు కాలేజీ వ్యవహారంలో సంచలనం

# రాత్రికి రాత్రే అంతా తారుమారు చేశారు

## మహిళా కమిషన్ చైర్పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి సంచలన వ్యాఖ్యలు



కడప,సెప్టెంబర్13 ఆంధ్ర ప్రగతి :
కృష్ణా జిల్లాలోని గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాల వ్యవహారంపై పెద్ద రచ్చే జరిగింది.. అయితే.. అలాంటిదేమీ లేదని పోలీసులు తేల్చారు.. కానీ, ఈ ఘటనపై ఏపీ మహిళా కమిషన్ చైర్పర్సన్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.. గుండ్లవల్లేరు ఘటనలో నూటికి నూరు శాతం హిడెన్ కెమెరాలు అంశం దాగి ఉందని మహిళా కమిషన్ చైర్పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి సంచలన వ్యాఖ్యలు చేశారు.. కడప నగరంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడిన ఆమె.. రెండు షవర్లను చీకట్లో పోలీసులు ఎత్తుకెళ్లడంపై తమకు అనుమానాలు ఉన్నాయన్నారు.. నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ బెదిరించడం.. తెల్లారేసరికి పరిస్థితులు మారుతాయి అనడం.. అనుమానాలకు తావిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. అయితే గుండ్ల వల్లేరు ఘటనలో ఎటువంటి హిడెన్ కెమెరాలు లేవని పోలీసులు అంటుంటే మహిళా కమిషన్ చైర్పర్సన్ మాత్రం నూటికి నూరు శాతం హిడెన్ కెమెరాలు అంశం దాగి ఉంది అనడం సంచలనంగా మారింది. కాగా, ఈ వ్యవహారాన్ని సీరియస్గా తీసుకున్న పోలీసులు.. తొలిసారి సీఈఆర్టీ సేవలను ఉపయోగించారు.. పోలీసు బృందాల దర్యాప్తు అప్డేట్స్ పై ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు.. కళాశాలలో పోలీసులు నేరుగా చేసిన దర్యాప్తులో ఎటువంటి స్పై కెమెరాలు గుర్తించలేదని ఆయన స్పష్టం చేశారు.. క్రిమినల్ కేసుల్లో ఏపీలో తొలిసారిగా ఢిల్లీకి చెందిన కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ సేవలు వినియోగించాం. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల అనుమానాలు నివృత్తి చేశాం.. కళాశాల వ్యవహారంపై ముగ్గురు ఐజీలు దర్యాప్తు చేశారు.. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నిష్పక్షపాతంగా పోలీసుల విచారణ జరిగిందన్నారు.. హాస్టల్ వాష్ రూమ్ల్లో కెమెరాలు ఏర్పాటు చేశారంటూ ఆరోపణలు వచ్చిన వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేశాం. విద్యార్థులు, స్త్రీ శిశు సంక్షేమ, పోలీసు బృందాల సమక్షంలో? ఆరోపణలు వచ్చిన వెంటనే హాస్టల్ వాష్ రూమ్ల్లో తనిఖీలు చేశాం అని ఐజీ అశోక్ కుమార్ అన్నారు.. వాష్ రూమ్లు, షవర్లలో ఎటువంటి కెమెరాలు గుర్తించలేదని స్పష్టం చేశారు. విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది, ఉద్యోగులు అందరినీ నేరుగా విచారించాం.. విచారణలో కెమెరాలు కానీ, ఆరోపిస్తున్న వీడియోలు కానీ ప్రత్యక్షంగా చూసినట్లు ఏ ఒక్కరు చెప్పలేదన్నారు.. కెమెరాల ఏర్పాటు, వీడియోలు అంశం ఎవరో చెబితేనే తమకు తెలిసిందని విచారణలో అందరూ చెప్పారని వెల్లడించారని స్పష్టం చేశారు ఐజీ అశోక్ కుమార్.. కానీ, ఏపీ మహిళ కమిషన్ చైర్పర్సన్ తాజాగా చేసిన వ్యాఖ్యలతో.. ఈ కేసులో అనుమానాలు మరింత పెరిగాయి.

# మరోమారు పార్టీకి దూరంగా బాలినేని : బుజ్జగించే ప్రయత్నంలో విడుదల రజని



ఒంగోలుసెప్టెంబర్13 ఆంధ్ర ప్రగతి :
ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యవహారం ఆ పార్టీలో కాకరేపుతోంది. వైసీపీని వీడేందుకు ఆయన నిర్ణయించుకున్నారనే ఓ ప్రచారం వాడి వేడిగా నడుస్తుంది. అందులోభాగంగా హైదరాబాద్లోని తన నివాసంలో ఒంగోలు నగర పాలక సంస్థకు చెందిన వైసీపీ కార్పొరేటర్లతో బాలినేని సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తన భవిష్యత్తు కార్యాచరణను కార్పొరేటర్లతోపాటు తన ముఖ్య అనుచరులకు ఈ సందర్భంగా బాలినేని వివరించారు. దీంతో బాలినేనితో రాయబారం నెరపడానికి మాజీ మంత్రి విడదల రజినీతోపాటు సతీష్ రెడ్డిని పార్టీ అధినేత వైఎస్ జగన్ రంగంలోకి దింపారు. దీంతో హైదరాబాద్లోని బాలినేని నివాసంలో ఆయనతో వారిద్దరు చర్చలు జరుపుతున్నారని సమాచారం. రోవైపు బుధవారం సాయంత్రం తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్తో బాలినేని శ్రీనివాసరెడ్డి సమావేశమైనట్లు ఓ ప్రచారం అయితే జరుగుతుంది. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాలంటూ బాలినేనిని వైఎస్ జగన్ కోరగా.. అందుకు ఆయన తిరస్కరించినట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా పార్టీ అధికారంలో ఉండగా.. తనను పక్కన పెట్టిన తీరును పార్టీ అధినేత వైఎస్ జగన్ ముందు బాలినేని ఉంచినట్లు సమాచారం. గతంలో పక్కన పెట్టి.. పార్టీకి ప్రతిపక్ష హోదా సైతం దక్కించుకోలేని వేళ.. తనకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఎలా అప్పగిస్తారంటూ తన అసంతృప్తిని మాజీ సీఎం వైఎస్ జగన్ ఎదుట బాలినేని వెళ్లగక్కినట్లు తెలుస్తుంది. పార్టీ వీడాలని తాను కృత నిశ్చయంతో ఉన్నట్లు ఈ భేటీలో వైఎస్ జగన్ ఎదుట బాలినేని కుండ బద్దలు కొట్టారని ఉమ్మడి ప్రకాశం జిల్లాలో జోరుగా సాగుతుంది. ఈ నేపథ్యంలో విడదల రజినీతోపాటు సతీష్ రెడ్డిని బాలినేనితో చర్చించేందుకు రాయబారానికి పంపినట్లు సమాచారం.